# 61. కళ్ళజోడు

ఓ వడ్రంగి షిరిడి సాయి భక్తుడు. ఓసారి అతను సాయి సేవలో భాగంగా గుజరాత్‌లోని భూకంప బాధితులకి పంపే నిత్యావసర వస్తువులని ఉంచే చెక్క పెట్టెలని మూసి, స్క్రూలు బిగించే పనిని చేపట్టాడు. ఉదయం నించి సాయంత్రం దాకా వందలాది పెట్టెలని మూసాడు. ఆ రోజు సాయంత్రం అతనికి కళ్ళజోడు అవసరం అయింది. జేబులో చూసుకుంటే అది లేదు. చుట్టు పక్కల వెదికితే ఎక్కడా కనపడలేదు. తను మూతలు మూసేసిన ఏదో ఓ పెట్టెలో అది పడిపోయిందని గ్రహించాడు. ఆరు వందల రూపాయలు పెట్టి కొన్న సరికొత్త కళ్ళజోడు అది.

"సాయినాథా! నా సమయాన్ని నీకు సమర్పించి నారాయణ సేవ చేసే నాకు ఇలాంటి నష్టాన్ని కలిగించడం నీకు భావ్యమా?' అని మనసులోనే అనుకున్నాడు.

కొన్ని వారాల తర్వాత భక్తి ఛానల్‌లో గుజరాత్‌లో విజయదశమి రోజున సాయి భక్తులు అన్నదానం చేసి, సాయి భజనలు పాడే కార్యక్రమం ప్రసారమైంది. ఆ వడ్రంగి దాన్ని చూడటం తటస్థించింది. భజన చేయబోయే ముందు ఓ వ్యక్తి ఇలా చెప్పాడు.

"సాయిని కొలిస్తే దేనికీ కొదవలేదుగా' అనే ఈ పాటని నేను నా స్వానుభవంలోంచి రాసి పాడుతున్నాను. కొన్ని వారాల క్రితం మన గుజరాత్‌లో వచ్చిన భూకంపంలో నా ఇల్లు నేలమట్టం అయి నా వస్తువులన్నీ నాశనం అయాయి. నా కళ్ళజోడుతో సహా సర్వం కోల్పోయాను. అది లేకపోతే నాకు చూపు ఆనదు. నాకు ఓ కళ్ళజోడు పంపమని సాయినాథుడ్ని ప్రార్థించాను. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ ఊరి నించి వచ్చిన చెక్క పెట్టెల్లో ఓ దాంట్లో ఓ చిన్న పెట్టె కూడా ఉంది. దాన్ని తెరిచి చూస్తే అది కళ్ళ జోడు. నేనది పెట్టుకుంటే ఆశ్చర్యంగా ఫ్రేము, అద్దాలు కూడా నాకు చక్కగా సరిపోయాయి. అప్పుడు కలిగిన ఆనందంతో 'సాయిని కొలిస్తే దేనికీ కొదవలేదుగా' అనే ఈ పాట నా కలంలోంచి వచ్చింది.

ఆ కళ్ళజోడుని నాకు పంపిన ఆ పవిత్రాత్మకి నా శిరస్సు వంచి పాదాభివందనం చేస్తూ ఈ పాటని మొదలుపెడుతున్నాను."

ఆ మాటలు వినగానే తన కళ్ళజోడుని పోగొట్టుకున్న వడ్రంగి కళ్ళు చెమర్చాయి.

## 62. సాధువు-దొంగ

ఓ గ్రామం పక్కనే ఉన్న కొండ గుహలో ఓ సాధువు తపస్సు చేసుకునేవాడు. గ్రామస్థులే అతనికి నిత్యం భోజనం పెట్టేవారు. కొందరు అతనికి ధనాన్ని కూడా ఇచ్చేవారు.

ఓ రోజు ఆ సాధువు ధ్యానంలో ఉండగా ఓ దొంగ కత్తితో వచ్చి దాన్ని ఝుళిపిస్తూ అడిగాడు.

"ఓ ముసలోడా! నీకు భక్తులు ఇచ్చిన డబ్బంతా ఎక్కడ దాచావో చూపించు. లేదా నిన్ను చంపుతాను."

"నీకు అంత శ్రమ అవసరం లేదు. ఆ మూల కుండలో నువ్వు ఆశ పడే ధనం ఉంది." నవ్వుతూ జవాబు చెప్పాడు సాధువు.

దొంగ ఆ కుండకి ఉన్న మూతని తీసి చూస్తే దాన్నిండా అనేక బంగారు నాణాలు కనిపించాయి. ఆ కుండని ఎత్తి నెత్తిన పెట్టుకుని వెళ్తున్న ఆ దొంగతో చెప్పాడు సాధువు.

"జాగ్రత్తగా తీసుకెళ్ళు నాయినా. కుండ పగిలితే నాణాలని నువ్వు ఇంటికి తీసుకెళ్ళడం కష్టం."

"నాకు తెలుసులే." విసురుగా జవాబిచ్చాడు ఆ దొంగ.

"కృతజ్ఞతలు చెప్పకుండా వెళ్ళడం ధర్మం కాదు."

దొంగ ఆ సాధువుకి కృతజ్ఞతలని విసుగ్గా చెప్పి వెళ్ళిపోయాడు. కొద్ది దూరంలోనే కుండతో వెళ్ళే ఆ దొంగ, అడవికి కట్టెలని కొట్టుకోడానికి వచ్చిన కొందరు గ్రామస్థుల కంట పడ్డాడు. వాళ్ళు అతన్ని పట్టుకుని కుండలో చూస్తే జరిగింది వారికి అర్థమైంది. అతన్ని ఆ సాధువు దగ్గరకి తీసుకువచ్చారు.